బస్టాండులో సమస్యల తిష్ట

- పెచ్చులూడుతున్న బస్టాండు పైకప్పు
- తాగునీటి వసతి లేదు
- మరుగుదొడ్లను బంద్ చేసిన వైనం
- ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు


పెచ్చులూడిన బస్టాండ్ పైకప్పు


బస్టాండ్‌లో మరుగుదొడ్లు బంద్ చేసిన దృశ్యం

హిందూపురం: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో సమస్యలు తిష్టవేశాయి. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. కనీసం మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పించలేదంటే బస్టాండు నిర్వహణ ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. హిందూపురం ఎమ్మెల్యేగా బాలకృష్ణ మూడు సార్లు ఎన్నికైనా బస్టాండు గురించి పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. అభివృద్ధి చేస్తామంటూ ప్రచారం చేసుకోవడమే తప్ప ఆచరణలో చూపడం లేదని గుర్తు చేస్తున్నారు.

శిథిలావస్థలో బస్టాండు..

ఆర్టీసీ బస్టాండ్ నిర్మించి దశాబ్దాలు కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. బస్టాండ్‌పై అంతస్తు అంతా శిథిలం కావడంతో ఆపై వెళ్లే దారి ఒక పక్క మూసివేశారు. బస్టాండ్‌లో ప్రయాణికులు కుర్చున్న చోట్ల పైకప్పు అంతా పెచ్చులూడి పడుతున్నాయి. అక్కడక్కడ అతుకులు వేసినా తిరిగీ పెచ్చులూడి పోతున్నాయి. దీంతో పైకప్పు నుంచి ఏ పెచ్చుపడి తల పగులుతుందోనని ప్రయాణికులు భయాందోళనకు గురువుతున్నారు. మరుగుదొడ్లు ఉన్నా నీటి వసతి లేకపోవడంతో వాటిని బంద్ చేశారు. ఇక తాగునీటి వసతి లేకపోవడంతో ప్రయాణికులు దాహంతో అలమటించాల్సిన దుస్థితి నెలకొంది.

తగ్గిపోతున్న సర్వీసులు..

గతంలో హిందూపురం డిపో నుంచి 65 దాకా సర్వీసులుండేవి. ప్రస్తుతం 50కి తగ్గిపోయాయి. ముఖ్యంగా చాలా గ్రామీణ సర్వీసులు రద్దుచేశారు. వీటితోపాటు గతంలో రెగ్యులర్‌గా ఉన్నా విజయవాడ- 2, కర్నూలు 1, బెంగళూరు 1, శ్రీరంగరాజపల్లి1, పొద్దుటూరు సర్వీసులు నడిచేవి. ప్రస్తుతం వీటన్నిటినీ రద్దుచేశారు. జిల్లా కేంద్రం పట్టపర్తికి ఒక సర్వీసు కూడా లేదంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అధ్వానంగా బస్టాండు



హిందూపురం బస్టాండు అధ్వానంగా ఉంది. కనీసం నీటి వసతి, మరుగుదొడ్లు సదుపాయం లేవు. చాలా మంది ప్రయాణికులు దూర ప్రాంతాల నుంచి వస్తుంటారు. పరిస్థితి ఇలా ఉంటే ఎలా?. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించారు.

– జయరాజ్, ప్రొద్దుటూరు

పేరుకే బస్టాండ్.. ఇక్కడ ఏమీ లేవు



హిందూపురం బస్టాండ్ పేరుకే అన్నట్లు ఉంది. ఇక్కడ కనీస వసతులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండు పైకప్పు శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కింద పడుతుందోనని భయాందోళన చెందాల్సి వస్తోంది.

– రామచంద్ర, లేపాక్షి

సదుపాయాలు కల్పిస్తాం

బస్టాండ్‌లో నీటి పంపింగ్ చేసే బోరు చెడిపోయినందున కొంత ఇబ్బంది ఏర్పడింది. నీటి సదుపాయం కల్పిస్తాం. బస్టాండ్‌లో కొంతభాగంగా శిథిలమైంది ఆ ప్రాంతంలో షెడ్స్ ఏర్పాటుకు టెండర్ ప్రక్రియ పూర్తయిపోయింది. వారం రోజుల్లో పనులు ప్రారంభమవుతాయి. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా బస్టాండులో సదుపాయాలు కల్పిస్తాం.

– శ్రీకాంత్, ఆర్టీసీ డీఎం, హిందూపురం

క్లుప్తంగా

తప్పిన ప్రమాదం


విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

లేపాక్షి: మండల కేంద్రం సమీపంలోని పిల్లిగుండ్ల కాలనీ వద్ద విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొన్న ఘటనలో పెను ప్రమాదం తప్పింది. ఆదివారం మధ్యాహ్నం ప్రముఖ పుణ్య క్షేత్రమైన లేపాక్షి వీరభద్రస్వామి ఆలయాన్ని దర్శించడానికి ఇద్దరు వ్యక్తులు బెంగళూరు నుంచి లేపాక్షికి కారులో బయలుదేరారు. అయితే పిల్లిగుండ్ల కాలనీ వద్ద ప్రమాదవశాత్తు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో స్తంభం విరిగి కారుమీద పడింది. అయితే అందులో ఉన్న ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు.

హిందూ మహా గణపతికి రూ.లక్ష విరాళం


కమిటీ సభ్యులకు నగదును అందిస్తున్న కాంతరాజు

అమరాపురం: మండల కేంద్రంలోని వినాయక నగర్‌లో వెలసిన హిందూ మహాగణపతి కమిటీ సభ్యులకు వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హలుకూరు కాంతరాజు తనవంతుగా రూ.లక్షను విరాళంగా అందజేశారు. కమిటీ అధ్యక్షుడు హనుమంతరాజు తదితరులు ఆదివారం హలుకూరు గ్రామంలో కాంతరాజును కలసి గణపతి ఉత్సవాల్లో భారీగా ఖర్చు వచ్చిందని తెలియజేశారు. ఆయన స్పందించి తనవంతుగా రూ.లక్ష నగదును వారికి అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

హోంగార్డు మృతికి నివాళి


రెహమాన్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు

అమరాపురం: మండల కేంద్రానికి చెందిన హోంగార్డు రెహమాన్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. మడకశిర రూరల్ సీఐ.రాజకుమార్, స్థానిక ఎస్ఐ. ఇషాక్‌బాషా సిబ్బంది ఆదివారం రెహమాన్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే అంత్యక్రియల కోసం ఆర్ఎస్ఐ ప్రదీప్ సింగ్ రూ.10 వేల చెక్కును మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

సత్ప్రవర్తనతో మెలగండి


మడకశిరలో కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

మడకశిర: ఎలాంటి గొడవలకు వెళ్లకుండా సత్ప్రవర్తనతో మెలగాలని అర్బన్ సీఐ నగేష్ రౌడీషీటర్లకు సూచించారు. ఆదివారం అర్బన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం వివిధ మహిళా కేసుల్లోని నిందితులు, రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ మీ కదలికలపై నిఘా ఉంటుందని అసాంఘిక కార్యకలపాలకు దూరంగా ఉండాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో స్వామివారు

అమరాపురం: హేమావతి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామికి ఉదయం సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మహామంగళహారతి ఇచ్చారు. అనంతరం వచ్చిన భక్తులకు ప్రసాద వినియోగం చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో మండలం నుంచే కాక సమీప కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నరు.

గురజాడ అప్పారావు జయంతి వేడుకలు


గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల వసతిగృహంలో ఆదివారం తపన సాహిత్య వేదిక ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సాహిత్య వేదిక నిర్వాహకులు సడ్లపల్లె చిదంబర రెడ్డి, డాక్టర్ అశ్వర్థనారాయణ, సిద్దగిరి శ్రీనివాసులు, రాజశేఖర్‌రెడ్డి, యువకవి గంగాధర్ తదితరులు గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గురజాడ చేసిన రచనలు, వాటిని చదివి కాలానుగుణంగా చైతన్యం కావాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ శ్రీదేవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

మడకశిర: పట్టణంలోని 4వవార్డు ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం గురుజాడ అప్పారావు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా యుటీఎఫ్ నాయకులు గురుజాడ అప్పారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు భూతన్న, మాలింగప్ప.జోగప్ప, మూడ్ల గిరియప్ప, కదురన్న, రవీంద్ర, యల్లప్ప, దేవరాజు, రామాంజి, నంజప్ప తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, బాలికలను వేధిస్తే కఠిన చర్యలు


హిందూపురంలో రౌడీషీటర్లను హెచ్చరిస్తున్న డీఎస్పీ మహేష్


పెనుకొండలో కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ నరసింగప్ప

హిందూపురం: మహిళలు, బాలికలను వేధిస్తు కఠిన చర్యలు డీఎస్పీ కేవీ మహేష్ హెచ్చరించారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆదివారం డివిజన్‌లోని మహిళా సంబంధిత నేరాల్లో ఉన్న 38 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మహిళలు, బాలికల పట్ల ఎవరైనా సరే తప్పుగా ప్రవర్తిస్తే కటకటాల వెనక్కి పోవాల్సి ఉంటుందన్నారు. గతేడాది హిందూపురం మండలం తూముకుంట, చిలమత్తూరు మండలం నల్లరాళ్లపల్లిలో బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడిన నిందితులకు కోర్టులో కఠిన శిక్షలు పడ్డాయని తెలియజేశారు. కార్యక్రమంలో సీఐలు జనార్దన్, రాజగోపాల్‌నాయుడు, అబ్దుల్‌కరీం, ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెనుకొండ: మహిళలలు, చిన్నారులపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ నరసింగప్ప హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో పలువురు పాత నేరస్తులకు డీఎస్పీ కౌన్సిలింగ్ ఇచ్చారు. లైంగిక వేధింపులు, అత్యాచారాలు, విద్యార్థుల హత్యలు, ఇతర నేరాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలుంటాయన్నారు. సీఐ రాఘవన్, ట్రైనీ ఎస్ఐ భువనేశ్వరి పాల్గొన్నారు.

రొళ్ల: స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో పోక్స్ కేసుల్లో నిందితులుగా ఉన్న వారికి మడకశిర సీఐ రాజ్‌కుమార్ ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళలు, బాలికలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

బోయకొండ గంగమ్మదేవికి ప్రత్యేక పూజలు

హిందూపురం: పట్టణంలోని సూరప్ప కట్ట వద్ద ఉన్న బోయకొండ గంగమ్మదేవి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రి ఆలయ ఆవరణలో అర్చకుడు మోహన్‌స్వామి శత్రుసంహరిణీ ప్రత్యంగిరాదేవి హోమం నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

పెనుకొండ రూరల్: గుట్టూరు వైజంక్షన్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కియా ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాలు..మక్కాజిపల్లి తండాకు చెందిన రామాంజి నాయక్ తన కుమారుడు సుశాంత్‌తో కలసి వ్యక్తి గత పనుల నిమిత్తం గుట్టూరుకు బైక్‌పై బయలుదేరారు. వైజంక్షన్ వద్దకు రాగానే అనంతపురం వెళ్తున్న కారు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన తండ్రీ కుమారులను స్థానికులు 108 వాహనం ద్వారా పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం రామాంజినాయక్‌ను అనంతపురం తీసుకెళ్లారు.

ఆర్యవైశ్యుల సామూహిక తర్పణ

పెనుకొండ: పట్టణంలో ఆదివారం ఆర్యవైశ్యులు సామూహిక తర్పణ కార్యక్రమం నిర్వహించారు. మహాలయ అమావాస్యను పురస్కరించుకుని స్థానిక ఆర్యవైశ్య కన్వెన్షన్ హాల్ తమ పెద్దలకు ప్రత్యేక పూజలు నిర్వహించి తర్పణం వదిలారు.

కేబుల్ చోరీ

అగళి: మధూడి గ్రామంలో తాగునీటి పథకం బోర్లకు సంబంధించిన కేబుల్‌తోపాటు సర్పంచుకు శివకుమార్ వ్యవసాయ బోరుకు సంబంధించిన కేబుల్‌ను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు సర్పంచ్ శివకుమర్, పంచాయతీ కార్యదర్శి పాణిరాజు తెలిపారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

గుడిబండ: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఎస్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మారుతిప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఎస్టీఎఫ్ సమావేశం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యం ధోరణిలో ఉందని ఆయన విమర్శించారు. వెంటనే 12వ పీఆర్సీని నియమించి, 30 శాతం ఐఆర్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్టీఎఫ్ గుడిబండ మండల అధ్యక్షుడిగా లోకేష్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి, సహాధ్యక్షుడు పార్థసారథి, కోశాధికారిగా పరుశురామ్, కార్యదర్శిలుగా చైతన్య, జగదీష్, భానుచంద్ర, కవిత తదితరులను ఎన్నుకున్నారు.

సంక్షిప్త సమాచారం

వీరభద్రుని సేవలో కేంద్ర చేనేత, జౌళి శాఖ జేడీ


జేడీ పద్మినిని సన్మానించిన దృశ్యం

లేపాక్షి: స్థానిక లేపాక్షి ఆలయాన్ని కేంద్ర చేనేత, జౌళి మంత్రిత్వ శాఖ జాయింట్ డైరెక్టర్ పద్మిని సింగ్లా ఆదివారం సాయంత్రం దర్శించుకున్నారు. వీరికి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్, ఈఓ నరసింహ మూర్తి స్వాగతం పలికారు. అనంతరం ఆమె వీరభద్ర స్వామి, దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. సెంట్రల్ సిల్క్ బోర్డు జాయింట్ కార్యదర్శి సమర్థన్, సీఎఫ్‌టీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ పిరియస్వామి, సెరికల్చర్ అడిషనల్ డైరెక్టర్ అరుణకుమారి తదితరులు ఉన్నారు.

ఆలయాలకు దసరా శోభ

- నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు


ముద్దిరెడ్డిపల్లి చౌడేశ్వరీదేవి


మడకశిరలోని కన్యకాపరమేశ్వరి

హిందూపురం/ మడకశిర/ అమరాపురం: దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాలు నూతన శోభను సంతరించుకున్నాయి. హిందూపురంలోని కన్యాకపరమేశ్వరి ఆలయం, ముదిరెడ్డిపల్లిలోని చౌడేశ్వరీదేవి ఆలయం, అష్టలక్ష్మి, కోల్హాపురీ మహాలక్ష్మిదేవి, గంగమ్మదేవి, ఎల్లమ్మ అమ్మవారు, జలదుర్గమ్మ దేవి, మడకశిర కన్యకాపరమేశ్వరి, వడిశలమ్మ, కొల్లాపురమ్మ, పూజమ్మ, గంగ పూజమ్మ, ముత్యాలమ్మ, ఊరుమారెమ్మ ఆలయం, అమరాపురం చోళమాంబదేవి, శ్రీదేవి, లక్ష్మి వేంకటేశ్వరస్వామి, కన్యాక పరమేశ్వరి ఆలయాలు, హేమావతి సిద్దేశ్వరస్వామి ఆలయాలను ముస్తాబు చేశారు. ఆయా ఆలయాల్లో అమ్మవార్లు రోజుకో రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం


జాబిలి చాంద్‌బాషాను సన్మానిస్తున్న పట్టణ ప్రముఖులు

పెనుకొండ: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, కవిగా సామాజిక సేవాకర్త జాబిలి చాంద్ బాషాను ఆదివారం పలువురు కవులు, కళాకారులు, సామాజిక సేవాకర్తలు, స్వచ్ఛంద సంస్థల నాయకులు, రాజకీయ ప్రముఖులు ఘనంగా సన్మానించారు. జిల్లా రచయితల సంఘం, భారతీయ తెలుగు సాహిత్య అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఎంక్యూఏ గ్లోబల్ ట్రస్టు కార్యాలయంలో కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా వక్తలు జాబిలి చాంద్‌బాషా సేవలను కొనియాడారు. ఉమర్ ఫారూఖ్‌ఖాన్, ప్రగతి శ్రీనివాసులు, న్యాయవాది శివరామకృష్ణ, కోనాపురం ఈశ్వరయ్య, రవిశంకర్ గురూజీ, కోగిర జయచంద్ర, యుటీఎఫ్ సుధాకర్, జాన్ ప్రియ నాథ్, శ్రీరామ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సిలోన్ ఇండియా జనరల్ మిషన్ డైరెక్టర్‌గా నాగేంద్రకుమార్


నాగేంద్రకుమార్‌ను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

హిందూపురం: సిలోన్ అండ్ ఇండియా మిషనరీ డైరెక్టర్‌గా పట్టణానికి చెందిన డాక్టర్ నాగేంద్రకుమార్ ఎన్నికయ్యారు. ఇటీవల బెంగళూరులో జరిగిన జనరల్ బాడీ మీటింగ్‌లో తనను ఎన్నుకున్నట్లు నాగేంద్రకుమార్ తెలిపారు. ఆదివారం సీఅండ్ఐజీ మిషన్ కాంపౌండ్ చర్చిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన్ను సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. సంఘ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ స్టీఫెన్ రాజ్, ట్రెజరర్ సాల్మన్ రాజ్, జాయింట్ సెక్రటరీ అరుణ్ కుమార్, బోర్డు సభ్యులు దేవరాజ్, ఆంజనేయులు, జార్జి బాబు, రూబేన్ యూత్ సభ్యులు , డేవిడ్, డేనియల్, శ్యామ్ బాబు, సురేష్, రాజుబాయ్,చిన్న తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ కోసం రోడ్డుపై సిమెంట్ దిమ్మె


పైపులైన్ కోసం ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మె

హిందూపురం: ఇంటిని నిర్మిస్తున్న వ్యక్తి తన పైప్‌లైన్ కోసం ఏకంగా రోడ్డుపై సిమెంట్ దిమ్మె ఏర్పాటు చేశాడు. వివరాలు..త్యాగరాజ నగర్ వెళ్లే దారిలో ఓ వ్యక్తి కొత్తగా ఇంటిని నిర్మిస్తున్నాడు. నీటి సౌకర్యం కోసం రోడ్డు అటువైపు నుంచి పైపులైన్ తీసుకున్నాడు. అయితే పైపులు దెబ్బతినకుండా ఏకంగా రోడ్డుపై సిమెంట్ దిమ్మె ఏర్పాటు చేశాడు. దీన్ని గుర్తించని వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానికులు సమస్యను వార్డు కౌన్సిలర్ దాదాపీర్‌కు తెలియజేయడంతో ఆయన నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు విషయాన్ని ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై మున్సిపల్ కమిషనర్‌ను సంప్రదించగా ఇప్పటికే ఇంటి యజమానికి జరిమానా విధించామని, త్వరలో రోడ్డుపై సిమెంట్ దిమ్మెను తొలగిస్తామని తెలిపారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ షేక్షావలి ఆదివారం తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో విన్నవించుకోవాలని సూచించారు. మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

నిందితులకు రిమాండ్

పావగడ: కడపలకెరె గ్రామంలో ఇద్దరు పిల్లలను చంపి తాను ఆత్మహత్యకు పాల్పడిన మహిళ కేసులో నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కడపలకెరెకు చెందిన సరిత(23) శనివారం పిల్లలు కుష్మిత్యాద్వ్(4), యుక్తి (2) లను చంపి తాను ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే.

ఈ కేసులో ప్రధాన నిందితులు మృతురాలి భర్త సంతోష్ కుమార్, అత్త అంజమ్మ, అవ్వ హనుమక్కను స్థానిక పోలీసులు అదుపు లోకి తీసుకుని స్థానిక కోర్టులో హాజరు పర్చారు. కోర్టు ఆదేశాల మేరకు వారిని రిమాండు కు మధుగిరి జైలుకు ఆదివారం తరలించారు. ఇదిలా ఉండగా తల్లీపిల్లల మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం కడపలకెరె గ్రామంలో ఆదివారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం కృషి చేయండి


వేణురెడ్డి ని సత్కరించిన రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి అన్సర్ అహ్మద్

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక నాయకులకు సూచించారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శులుగా నియమితులైన సి. అన్సర్ అహ్మద్, షేక్ అమానుల్లా, సంయుక్త కార్యదర్శి ఫారూఖ్ ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో టీఎన్ దీపికను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సీనియర్ నేత వేణురెడ్డిని ఘనంగా సన్మానించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని వేణురెడ్డి వారికి సూచించారు.

రేపు మడకశిరలో జాబ్‌మేళా

మడకశిర: పట్టణంలోని ఎస్వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మంగళవారం ఉదయం 9 గంటలకు నిరుద్యోగులకు జాబ్‌మేళాను ఏర్పాటు చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరి క్రిష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 ఏళ్లు ఉండి టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ చదివిన నిరుద్యోగులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. జాబ్‌మేళాలో 3 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం చెల్లిస్తారని పేర్కొన్నారు.ఉద్యోగాలకు ఎంపికై న అభ్యర్థులు హిందూపురం, పెనుకొండ, అనంతపురం, హైదరాబాద్, బెంగళూరులో పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. నిరుద్యోగులు ఆధార్‌కార్డు, విద్యార్హత పత్రాలు, బయోడేటాతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 9966682246, 9177095411 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

26న వాహనాల వేలం

మడకశిర: స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 26న ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ మురళీకిశోర్ ఆదివారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

అంధకారంలో పారిశ్రామికవాడ


చీకటిగా ఉన్న తూమకుంట పారిశ్రామివాడ రోడ్డు

హిందూపురం: తూమకుంట పారిశ్రామిక వాడలో గత ఐదు నెలలుగా వీధిలైట్లు వెలగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కార్మికులు చెప్పారు. రాత్రిపూట ఇటీవల తరచూ ప్రమాదాలు, చోరీలు కూడా జరుగుతున్నాయని వాపోయారు. ఏపీఐఐసీ అధికారులు స్పందించి వీధిలైట్లు ఏర్పాట్లు వేయాలని కార్మికులు కోరుతున్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న సీఐ రాజ్‌కుమార్

అగళి: స్థానిక పోలీస్ స్టేషన్‌ను మడకశిర సీఐ రాజ్ కుమార్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పలు రికార్డులను సీఐ పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్ఐ వీరేష్‌కు సూచించారు. రోజూ రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించాలని ఆదేశించారు.

మూర్ఛ వైద్య శిబిరం

హిందూపురం టౌన్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అల్ హిలాల్ పాఠశాల ఆవరణలో ఉచిత మూర్ఛవాది వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ ఈటీ రామ్మూర్తి ఆధ్వర్యంలో మూర్ఛ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, రెండు నెలలకు సరిపడా మందులు అందించారు. జేవీవీ నాయకులు రామకృష్ణ, మంజుళ, ఉగ్రప్ప, అంజన్ రెడ్డి, గంగిరెడ్డి, నాగేంద్రాచారి, జీఆర్ శ్రీనివాసులు, లక్ష్మీపతి, నాగరాజుగుప్త, అబ్దుల్ హఖ్, శివరాం, ప్రభాకర్, బాలగంగాధర్‌నాయక్, అతావుల్లా, మంజునాథ చారి, విశ్వనాథ చారి, సుబ్రమణ్యానాయక్ పాల్గొన్నారు.